# త్రైలోక్యగీత

## చతుర్థాధ్యాయః - నాలుగవ అధ్యాయము
### జ్ఞాన  భక్తి కర్మ యోగము

త్రైలోక్యా ఉవాచ:
కిం జ్ఞానభక్తికర్మాహుః, దత్త! బ్రూహి సవిస్తరమ్ |
స్పష్టాకర్షక వేదాంతం, న పశ్యామి భువి క్వచిత్ ||4.1||

కుమారి త్రైలోక్య అడిగినది: -
ఓ దత్తా! జ్ఞానము, భక్తి, కర్మలనగా ఏమి? దయచేసి తమరు సవిస్తారముగా వివరించండి. ఇంతగా స్పష్టమైన జ్ఞానమును ఇంతటి ఆకర్షణీయమైన ఆధ్యాత్మిక జ్ఞానమును నేను ఈ భూమిపై మరెక్కడా చూడలేదు.

### శ్రీ శ్రీ శ్రీ దత్త స్వామి సమాధానము -

**జ్ఞానే తే మహతీ శ్రద్ధా, సద్గురోః ప్రేరణాయ యా |**
**స్పష్టాకర్షణ హేతుస్తు, సత్యం జ్ఞాన మితి శ్రుతిః ||4.2||**

నీకు ఆధ్యాత్మిక జ్ఞానమునందు మక్కువ ఎక్కువ. ఆధ్యాత్మిక జ్ఞానము నేర్చుకొనుటకు శిష్యులు ఇటువంటి శ్రద్ధ కనబర్చితే, దివ్య ప్రబోధకులకు మరింతగా ఆధ్యాత్మిక జ్ఞానమును వివరించాలనే స్ఫూర్తి కలుగుతుంది. నా ఆధ్యాత్మిక జ్ఞానములో స్పష్టత మరియు ఆకర్షణశక్తికి గల ఏకైక కారణము ఇది పరిపూర్ణమైన సత్యము కావటమే. ఇంతకు మించిన కారణము ఇంకేదీ లేదు. ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక జ్ఞానము యొక్క మొదటి లక్షణము 'సత్యము' అని వేదము ప్రమాణీకరిస్తుంది.( సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ..)

**శిష్యో మోహాను వాక్యార్థీ, గురు స్తద్దక్షిణాతురః |**

### న జానన్నసదావక్తి, జ్ఞాత్వా సదపి చా పరః ||4.3||

[శిష్యుల కెప్పుడూ ప్రాపంచిక వస్తువుల పట్ల నిర్హేతుకమైన ఆకర్షణ ఉంటుంది. తమ గురువు నుండి లేదా ఆధ్యాత్మిక బోధకుని నుండి కూడా వారు ప్రాపంచిక కోరికలు తీర్చగల బోధనలే కోరుకుంటారు. తమ ప్రాపంచిక ఆకర్షణను వ్యతిరేకించే బోధనలను వారు అంగీకరించరు. ఇంకా చెప్పాలంటే గురువు ఎప్పుడూ తమకు సౌకర్యముగా ఉండే రీతి లోనే బోధించాలని అనుకుంటారు. కాబట్టి నేటి ఆధ్యాత్మిక బోధకులు కూడా తన శిష్యునికి సంతోషము కలుగునట్లు బోధించి అతని వద్ద నుండి మరింత ధనమును గురుదక్షిణగా పొందుతున్నారు. కొంత మంది ఆధ్యాత్మిక బోధకులు, తమకు సరైన జ్ఞానము తెలియనందున, తప్పుడు జ్ఞానమునే బోధిస్తున్నారు. తమ గురువుల నుండి నేర్చుకున్న తప్పుడు జ్ఞానమునే వారి శిష్యులకు అందిస్తున్నారు. ఈ విధంగా అంధ సంప్రదాయము కొనసాగిస్తున్నారు. మరో విధమైన బోధకులు తమకు సత్యమైన జ్ఞానము తెలిసి ఉన్నప్పటికినీ తమ శిష్యులను సంతోషపరచే లక్ష్యముతో, వారికి అనువైన జ్ఞానమునే బోధించి ఎక్కవ మొత్తములో గురుదక్షిణ పొందుతున్నారు. ఈ రెండు సందర్భాలలో శిష్యులు కేవలము తప్పుడు జ్ఞానమునే పొందుతున్నారు కాబట్టే సమాజము ప్రస్తుతము దాని పర్యవసానములను అనుభవిస్తున్నది. ]

### సద్గురోస్తు సద్దైవేతి, సోఽవతీర్ణో నరః పరః |
### సర్వ దాతా హి సర్వేషామ్, ఆప్తకామ ఇతి స్తుతః ||4.4||

[***సద్గురువు (దివ్యబోధకుడు)*** ఎల్లప్పుడు సత్యమైన జ్ఞానమునే బోధిస్తాడు, ఎందుకంటే ***తాను స్వయంగా భూమిపై అవతరించిన భగవంతుడే*** అయినందున. తాను ఎవ్వరికైననూ ఏదైననూ ప్రసాదించగల సర్వదాత. ఇట్టి ఆధ్యాత్మిక ప్రబోధకుడు అయిన భగవంతుడు, సంపూర్ణముగా సంతృప్తుడు కావున, **'ఆప్తకామస్య కా స్పృహా'** అని వేదముల చేతను, తనకు ఇంకా

కావలసినదేమీ లేనందున '**నాఽనవాప్తమవాప్తవ్యం**' అని భగవద్గీత చేతను కీర్తింపబడినవాడు. కావున గురుదక్షిణల మీద దృష్టి లేనివాడు.]

**కర్మభక్తిజ్ఞాన షట్క, త్రయం గీతేతి కేచన |**
**విపరీతం సదిత్యేవ, మతం మే సువిచారతః ||4.5||**

[భగవద్గీత యందు కర్మ, భక్తి, జ్ఞానయోగములు అనబడే మూడు భాగములు మొదటి నుండి క్రమముగా ఉన్నాయని, ఒక్కొక్కటి ఆరేసి అధ్యాయాలు కలదని కొందరు పండితులు అంటారు. దీనిని సవ్యముగా విశ్లేషించగా ఈ వర్గీకరణ సరైనది కాదని, ఇదే క్రమమును తిరగేసి చెబితే (జ్ఞాన, భక్తి, కర్మలు) తర్కసంగతముగా ఉండగలదని **నాకు** అనిపిస్తున్నది.]

**ముంబాపుర విశేషజ్ఞ, స్తథాఽఽకృష్టః ప్రయాతి తత్ |**
**క్రమాత్ జ్ఞాన భక్తి కర్మ, సర్వైరప్యనుభూయతే ||4.6||**

[ముంబాయి నగర విశేషములు తెలిసినప్పుడు ఆ నగరమును చూడాలని ఒకడు ఆకర్షితుడవుతాడు. ఈ ఆకర్షణ కారణముగా, చివరికి ప్రత్యక్ష కార్యము అయిన ముంబాయి నగరముకు ప్రయాణించడము జరుగుతుంది. అతడు ముంబాయి గురించి తెలుసుకునే వివరము మొదటి సోపానము అయిన 'జ్ఞానము' అనబడతుంది. దాని నుండి ఉత్పన్నమైన ఆకర్షణ అనేది 'భక్తి' అనబడే రెండవ సోపానముగా తెలియుచున్నది. ముంబాయి నగరమునకు ప్రయాణించడము అనెడి 'కర్మ' ఈ రెండు సోపానాల తర్వాత తుది ఫలితముగా ఏర్పడుతుంది. కాబట్టి ఇదే వరుస క్రమములో జ్ఞానము, భక్తి, కర్మలను ప్రజలంతా అనుభవిస్తున్నారు.]

**జ్ఞానే నారద సంబుద్ధా, కృష్ణాఽఽకృష్టా చ రుక్మిణీ |**

**పశ్చాత్ కార్యం ప్రవిష్టోఽభూత్, దృష్టాన్తోఽయం పరస్తథా ||4.7||**

[ఈ మూడు సోపానాల సరైన క్రమమును తెలుసుకొనుటకు మరొక ఉదాహరణ, రుక్మిణి నారద ఋషి ద్వారా శ్రీకృష్ణుని కళ్యాణగుణముల వివరము తెలుసుకున్నది (జ్ఞానయోగము). తర్వాత శ్రీకృష్ణ భగవానుని యందు అపరిమిత ప్రేమతో అతని పట్ల ఆకర్షితురాలైంది (భక్తియోగము). ఆ తర్వాత ఆమె కర్మ చేయడము ప్రారంభిస్తూ, తన ఇష్టాన్ని తెలియజేస్తూ శ్రీకృష్ణునకు ప్రేమలేఖ వ్రాయడమే కాదు శిశుపాలునితో తన వివాహము జరుగవలసిన రోజే శ్రీకృష్ణునితో కలిసి పారిపోయింది (కర్మయోగము).]

**ద్వివిధం కర్మసన్యాస- త్యాగాభ్యాం ఉభయత్ర చ |**
**ద్వౌ దృష్టౌ కర్మసంన్యాసాత్, త్యాగాత్ కర్మ ఫలస్య చ ||4.8||**

[చివరిదైన ప్రత్యక్ష సాధన లేదా కర్మయోగమును సాధించుటకు రెండు ఉపవిభాగములున్నవి. కర్మ యోగములో మొదటిది, భగవంతునికి సేవ చేయడము (కర్మసంన్యాసము), దీని అర్థము వర్తమాన నరావతారుడైన అనూహ్య పరబ్రహ్మమునకు కాలోచిత సేవ (క్రియ) చేయడము. కర్మ యోగములో రెండవది, త్యాగము లేదా సమర్పణము. అంటే కర్మఫలత్యాగము లేదా భక్తుడు చేసిన ప్రాపంచికమైన విధుల ద్వారా పొందిన ప్రతిఫలమును వర్తమాన నరావతారమైన అనూహ్య పరబ్రహ్మమునకు సమర్పించడము. పనికి పొందిన ప్రతిఫలమును సమర్పించడము అంటే జీవుడు తాను కష్టించి పనిచేసి సంపాదించిన డబ్బు, సంపదలను వర్తమాన నరావతారమైన అనూహ్య పరబ్రహ్మమునకు సమర్పించడము. క్లుప్తంగా చెప్పాలంటే కర్మ యోగములో రెండు విధానాలు ఉంటాయి. 1. కర్మ సంన్యాసము 2. కర్మ ఫల త్యాగము.

మొదటి ఉదాహరణ లో ముంబాయి టికెట్ కొరకు రైల్వేస్టేషన్ కు నడచివెళ్ళడము క్రియ. ఇది ***కర్మ సంన్యాసము***. రైల్వేస్టేషన్ లో డబ్బు చెల్లించి టికెట్ కొనాలి. ఇలా తను కష్టపడి సంపాదించిన డబ్బును సమర్పించడము అంటే ముంబాయికి టికెట్ కొనడము అనేది ***కర్మ ఫల త్యాగము*** అనబడుతుంది.

రెండవ ఉదాహరణలో రుక్మిణీ దేవి తన ప్రేమలేఖను పురోహితునికిచ్చి శ్రీకృష్ణుని వద్దకు పురోహితుని పంపడము ***కర్మ సంన్యాసము*** అయితే శ్రీకృష్ణునికి ప్రేమలేఖ అందించి తిరిగి వచ్చిన తర్వాత అతనికి తన బంగారు హారమును బహూకరించడము ***కర్మ ఫలత్యాగము*** అనబడుతుంది.]

**ఆద్యౌ భావౌ పరం కర్మ, భక్తిః ప్రేమైవ ద్రైవికీ |**
**నిష్కామకర్మ సత్యం హి, భక్తేః కర్మ నిరూపణమ్ ||4.9||**

[మొదటి రెండు సోపానాలైన జ్ఞాన, భక్తియోగములు పూర్తిగా సిద్ధాంతపరమైనవి. అంటే భావాత్మక మైనవి. మూడవదైన చివరి సోపానము కర్మ యోగము ఆచరణాత్మకమైనది. రెండవ సోపానమైన భక్తి, భావాత్మక భక్తి మరియు మూడవ సోపానము అయిన కర్మ అనగా ఆచరణాత్మక భక్తి. భక్తి అనగా భగవంతుని యందు గల ప్రేమ. ప్రేమ అనగా ప్రాపంచిక బంధాల పట్ల ఉత్పన్నము అయ్యే ఆకర్షణ భావము. ఈ విధంగా భక్తి ప్రేమల మధ్య ఏ భేదము లేదు. ఎలాంటి ఫలితాలను తిరిగి ఆశించని ప్రేమ (నిష్కామకర్మ) సత్యమైన ప్రేమ. ప్రేమించిన వారి నుండి ఏవైనా ప్రయోజనాలను తిరిగి ఆశించినట్లైతే ఆ ప్రేమ అసత్యము. కర్మాచరణాత్మక మైన క్రియారూపభక్తి ప్రదర్శింపబడటము ద్వారా సిద్ధాంత పరమైన భావరూపభక్తి నిరూపించబడుతుంది.]

**సదా ఫలం కర్మణో హి, వృక్షస్యేవ ప్రమాజలమ్ |**
**పాంసుర్భక్తిద్వయం ముఖ్యం, వృక్షస్యేవాంతిమం ఫలమ్ ||4.10||**

[చివరిదైన కర్మ యోగము ద్వారా ఫలితము లభిస్తుంది. ఎప్పుడైనా ఫలములు వృక్షాల నుండే కదా లభిస్తాయి. వృక్షానికి ప్రాణము పోసే నీరు జ్ఞానమైతే, మొక్క వృక్షముగా ఎదుగుటకు అవసరమైన ఎరువు భక్తి. ఈ విధంగా జ్ఞానము (నీరు), భక్తి (ఎరువు) మొక్కను సజీవముగా ఉంచుటకు మరియు పెరిగి వృక్షమగుటకు కారణములు. కానీ పండ్లు మాత్రము కర్మమనే వృక్షము నందే లభిస్తాయి. ]

**రహోదత్త ఫలాకాంక్షీ, పితామహ ఇవేచ్ఛతి |**
**దేవ స్సేవా ధనాంశాయ, యాచక స్స పరీక్షయా ||4.11||**

[భగవంతునికి భక్తుని నుండి ఏమీ అవసరము లేదు. కాని భక్తుని యథార్థమైన భక్తిని పరీక్షించడానికి భగవంతుడు యాచకుని వలె నటిస్తాడు. తాతయ్య ఒక బిస్కెట్ ముక్క ఇమ్మని తన మనవడిని అడగడము, పిల్లవానికి తన మీద గల యథార్థమైన ప్రేమను పరీక్షించుటకే గాని తనకు ఆ బిస్కెట్ అవసరమై కాదు. ఎందుకంటే ఆ బిస్కెట్ ప్యాకెట్ కొనితెచ్చి వాని తల్లికి ఇచ్చి, వాటిని పిల్లవానికి ఇమ్మని చెప్పి అంతా రహస్యముగా ఉంచినది తానే. అదే విధముగా సమస్త సంపద, సమస్త శక్తులూ మనకు ఇచ్చిన విషయమును రహస్యముగా ఉంచి మనలను కొంత సేవ చేయమని కొంత ధనత్యాగము చేయమని భగవంతుడు కోరేది మనకు తనపై నున్న యథార్థమైన భక్తిని పరీక్షించుటకే కాని తనకు అవసరముండి కాదు.]

**భావదాన ఫలాకాంక్షా, వేశ్యా భక్తి సమార్థతః |**
**వైశ్యభక్తి స్సమాకాంక్షా, పుత్రభక్తి స్సదోత్తమా ||4.12||**

[మూడు రకములైన భక్తి విశేషములు ఉన్నాయి.

1. **వేశ్యాభక్తి** అనగా భావాత్మక భక్తిని సమర్పించి భోగించదగినవి లేదా ప్రత్యక్షమైనవి అయిన ఫలితములను (ప్రాపంచికమైన వస్తు-సేవా విశేషాలు) పొందాలని కోరడము.

2. **వైశ్యభక్తి** అనగా వాణిజ్య ధోరణిలో ఆచరణాత్మక భక్తిని (ప్రాపంచికమైన వస్తు-సేవా విశేషాలు కొంత) సమర్పించి అందుకు సరిపడ ప్రతిఫలమును దృశ్యమాన జగత్తులోని వస్తుసేవల రూపములో ఆశించుట.

3. **పుత్రభక్తి**, ఇది తమ సంతానము పట్ల గల ప్రేమ వంటిది. సమస్త వస్తుభోగములు సంతానమునకు ఇచ్చినప్పటికినీ వారి నుండి తిరిగి ఏమీ ఆశించక పోవడము. ఉత్తమమైన ఈ చివరి విశేష భక్తి భగవంతునకి ఎంతో ఇష్టమైనది. ఇందులోనే దత్తుని పుత్రునిగా భావించి ఆయనకు కర్మ ఫల త్యాగము చేయుట జరుగుతుంది. కానీ మనము భగవంతుని నుండి ఫలములను ఆశిస్తూ విపరీత మార్గములో అదే యుక్తితో ఆయననే దత్త తండ్రిగా భావిస్తున్నాము! అనగా దత్తునికి త్యాగము చేయుటకు బదులు దత్తుని నుండియే త్యాగమును ఆశిస్తున్నాము!]

**అసాధ్యా తు తృతీయేతి, న వాచ్యా దృశ్యతే సుతే |**
**కథం సైవ పరే న స్యాత్, శైలోత్క్షేపః క్వచిన్న హి ||4.13||**

[భక్తుడైన వాడు భగవంతుని నుండి ఏమీ ఆశించక ఆచరణాత్మకముగా కర్మ ఫల త్యాగము చేయడము తనకు దుస్సాధ్యము అనలేడు. ఎందువల్ల నంటే ప్రతి వ్యక్తికీ తమ సంతానము పట్ల సాధ్యమైన ఇట్టి భక్తి (ప్రేమ) భగవంతుని పట్ల మాత్రం సాధ్యము కాదనుట తర్కయుక్తము కాదు కదా. ఎవరైనా 'ఈ నగరములో నేను పర్వతమునెత్త గలను కాని ఆ నగరములో మాత్రము ఎత్తలేను ' అని చెప్పరు కదా! ఒకవేళ ఎవరికైనా ఇటువంటి ఉత్తమమైన భక్తి కలిగి ఉండటం అసాధ్యము అని అంటే అది మిగిలిన అన్నిచోట్ల కూడా అసాధ్యమే అయి ఉండాలి.]

**జ్ఞాతా దైవాయ దద్యాత్త్వం, శ్రద్ధా భీ హ్రీ సమర్పితాః |**
**నహ్యేష యాచకో దేవః, తవ భక్తి పరీక్షకః ||4.14||**

[సత్యశోధన చేసి ఎప్పుడైతే నీవు వర్తమాన నరావతారమును భగవంతుడు అని గుర్తించావో, అప్పుడు నీ భక్తి, సేవలను నీ సంపూర్ణమైన భక్తిభావముతో, సిగ్గుతో, భయముతో మాత్రమే సమర్పించాలి. ఎందువల్ల నంటే భగవంతుడు యాచకుడు కాదు. నీవు ఒక యాచకునికి నిర్లక్ష్యముతో, అహంభావముతో ఇచ్చినప్పటికినీ అతడు దానిని కృతజ్ఞతాభావము తోనే తీసుకొన వచ్చును. ఎందువల్ల నంటే ఆ సమయములో తనకు ఆ సహాయము అవసరమై ఉన్నది. వేదము ఈ సత్యమును ఎలుగెత్తి చాటుతున్నది.(శ్రద్ధయా దేయం, భియా దేయం, హ్రియా దేయమ్ ). తన పట్ల నీ భక్తిని పరీక్షించుటకు మాత్రమే భగవంతుడు నీ త్యాగముల గ్రహీత అయినాడు. ]

**శంకరో లక్ష్మణో మధ్వ, స్త్రిమూర్తీనాం స్వరూపిణః |**
**జ్ఞాన భక్తి కర్మ రూపాః, క్రమాత్ దత్తావతారకాః ||4.15||**

[పరమశివుని అవతారమైన ఆదిశంకరులు లోకములో ఆధ్యాత్మిక జ్ఞానమును ప్రతిష్ఠించినారు. అనంతరము భగవానుడైన విష్ణువు అవతారమైన రామానుజులు భక్తిని ప్రతిపాదించారు. ఆ తరువాత బ్రహ్మదేవుని అవతారమైన మధ్వులు (ఆచరణాత్మక భక్తి రూపమైన) కర్మ మరియు కర్మ ఫల త్యాగములను ప్రతిపాదించారు. ఈ మూడు దైవరూపాలలో ఉన్నది దత్తభగవానుడొక్కడే అయినందున ఆ ముగ్గురు గురువులు కూడా భగవంతుడైన దత్తుని యొక్క మూడు మానవస్వరూపాలే. ఈ ఆధ్యాత్మిక గురువుల అవతరణ క్రమము, జ్ఞాన భక్తి కర్మముల క్రమమును తెలుపుతున్నది.]

**జ్ఞానాత్ పశ్చాత్ దశే ద్వే హి, సకృదేవ ప్రమాఫలమ్ |**

**శంకరః ప్రాహ సిద్ధాంతః, తత్తత్ కాలోచితాః ఖలు ||4.16||**

[మొదటి సోపానములో ఆధ్యాత్మిక జ్ఞానమును పొందడానికే పూర్తికాలము పడుతుంది. ఆధ్యాత్మిక జ్ఞానము ద్వారా భగవంతుని కళ్యాణగుణముల వివరము తెలిసిన వెంటనే ఆ దివ్య స్వరూపము పట్ల కలిగే ఆకర్షణ కారణముగా జీవాత్మల యందు భక్తిభావము ఉత్పన్నమవుతుంది. చివరగా ఆ భక్తుడు ప్రాపంచిక బంధాల నుండి విముక్తుడై భగవంతుడినే సంపూర్ణ సమర్పణముతో సేవించగలడు. దివ్యమైన తుదిఫలితము పొందుటకు తర్వాత రెండు సోపానాలు స్వతహాగా జరిగిపోవును. రసాయన చర్యలలో ఒక చర్య వివిధ క్రియా దశల ద్వారా జరిగినప్పుడు మొదటి క్రియకే అంతా సమయము పట్టితే మొదటి క్రియకు పట్టే సమయమునే పూర్తి ప్రక్రియ జరిగే కాలముగా చెప్పబడుతుంది. దీనిని ఆధారముగా చేసుకుని శంకరులవారు ఆధ్యాత్మిక జ్ఞానమే తుదిఫలితమైన మోక్షమును ఇస్తుందని బోధించారు. **(జ్ఞానా దేవ తు కైవల్యం..).** ఈ ముగ్గురు ఆధ్యాత్మిక బోధకులు బోధించిన మూడు విధములైన ఆధ్యాత్మిక జ్ఞానము వారి జీవితసమయాలలో వారిని చేరిన భక్తుల స్థాయిలను అనుసరించి బోధించబడినందున వేర్వేరుగా అనిపిస్తుందని మనము తెలుసుకోవాలి.]

**గురు స్సత్యం సద్గురుస్తు, హితం బ్రూతే మృషాఽపి తత్|**
**అర్థవాదే శిశుం చంద్రాత్, భోజయేన్మాళి శూలవత్ ||4.17||**

[పండితుడు (గురువు) శిష్యుల స్థాయిని పట్టించుకోకుండా సత్యమును బోధిస్తాడు. కాని దివ్య ప్రబోధకుడు (సద్గురువు) శిష్యుల స్థాయిని అనుసరించి బోధించడమే కాదు వారి ఆధ్యాత్మిక పురోగతికి అవసరమైతే సత్యమును తిప్పి కూడా చెప్పగలరు. శిష్యుని అభ్యున్నతి కోసము సత్యమును స్వల్పముగా మార్చి చెప్పినా అది తప్పు కాదు. ఎలాగంటే అమ్మ భోజనము అంతా తినిపించుటకు తన శిశువుతో 'నీవు గాని మొత్తము

తిన్నావంటే చందమామ దిగి వస్తాడు' అని అబద్ధము చెప్పుతుంది కదా. ఏదైనా సత్ప్రయోజనము కోసము ఆడే అబద్ధము, అబద్ధము కాదు, అది అర్థవాదము అనబడుతుంది. ఒకానొక మూర్ఖుడు తన చెవి నుండి తొండ తలలోకి దూరిందని నమ్మి విపరీతమైన తలనొప్పి పెంచుకుంటాడు. ప్రతి వైద్యుడు (గురువు) దీనిని త్రోసి పుచ్చుతాడు. కాని సద్గురువు వంటి వైద్యుడు ఆ రోగి చెప్పినది నమ్మినట్టుగా నటించి చెవి వెనకదాచిన ఒక తొండను విసిరివేసి “ఇదే చెవిలో దూరిన తొండ , ఇలా బయటికి వచ్చిందని” చూపి వాని తలనొప్పిని నయము చేస్తాడు. ]

**సాధనం భక్తి రన్యార్థే , సాధ్యా స యది కేవలః |**
**ఉన్మాదో నాయకాయేవ, దుస్సాధ్యా న హి దర్శనాత్ ||4.18||**

[ప్రియమైన భగవంతుని ప్రేమతో ఆరాధించే మనము ఎల్లప్పుడూ తన నుండి మనకు ప్రియమైన ప్రాపంచిక ప్రయోజనాలను ఆశిస్తాము. నిజానికి మన ప్రేమ అంతా కూడా ఆ పొందగోరే ప్రాపంచిక ప్రయోజనాల మీదనే గాని భగవంతుని మీద కాదు. ఇక్కడ భగవంతుడు మన స్వార్థ ప్రయోజనాలు తీర్చగల ఒక పనిముట్టు మాత్రమే. ఇది నిజమైన భక్తి కాదు కేవలము సాధన భక్తి - అనగా మన కోరికలు ఫలించుటకు భగవంతుని సాధనముగా వాడుచున్నాము. కోరికలు తీర్చడానికి భగవంతుని యందు భక్తిని మార్గముగా ఎంచుకోకుండా స్వయముగా ఆ భగవంతుడే సంపూర్ణ లక్ష్యముగా భక్తి కలిగి ఉండడము సాధ్యభక్తి. ఇలా మరే ఇతర కోరికలు లేకుండా కేవలము భగవంతుడినే ప్రేమించడము అసాధ్యమైనదేమీ కాదు. ప్రపంచములో ఇలాంటి పిచ్చిప్రేమను మనము చూస్తూనే ఉన్నాము. ఒక సినిమా హీరో లేదా రాజకీయ నాయకునికి ఉండే ఫ్యాన్ ఒకడు అవతలి వైపు నుండి ఏ ప్రయోజనమును పొందడు. నిజానికి ఫ్యాన్ తను కష్టపడి సంపాదించిన డబ్బునే ఆ నాయకుని లేదా సినిమా హీరో మీద ప్రేమతో ఖర్చు చేసి ఆనందిస్తాడు. అంతేకాక ఆ హీరో లేదా ఆ

నాయకుడు చనిపోయినపుడు తట్టుకోలేక ఫ్యాన్ తనంతట తానే ఆత్మహత్య చేసుకుంటాడు.]

**సమాధిర్నిశ్చయః పూర్ణః, బలవాన్యోగ సత్ఫలమ్ |**
**నరావతార కృష్ణేన, మునయో గోపికా యయుః ||4.19||**

[ఇట్టి ఫ్యాన్ వలె ఇతరులెవరి పట్ల ఏ విషయము పట్లనూ ఆకర్షణ లేక తన మనసును మొత్తము భగవంతుడి యందు సంపూర్ణంగా సమర్పించినట్టి ఈ విధమైన ప్రేమయే ఏకభక్తి. ఈ స్థితియే సత్యమైన 'యోగము' యొక్క సత్యమైన ఫలితమైన 'సమాధి' స్థితి. సం+అ+ధి యందు 'సం' అనగా సంపూర్ణము (మొత్తము), 'అ' అనగా నిరంతరము, 'ధి' అనగా బుద్ధి చేత ఎంపిక చేయబడిన నిర్ణయము. తత్కాలీన నరావతారమై, 'శ్రీకృష్ణుడు' అని పిలవబడిన భగవానుడి నుండి గోపికలుగా జన్మించిన ఋషులు ఇటువంటి 'సమాధి' స్థితిని పొందియున్నారు.]

**జ్ఞాన భక్తి కర్మ పాఠ-కళా విశ్వ విదాలయాః |**
**విభూతిః ప్రథమా కక్ష్యా, యోగవిద్యార్థినాం క్రమాత్ ||4.20||**

[జ్ఞానము లేదా జ్ఞాన యోగము అనగా పాఠశాల. ఇంకా భక్తి లేదా భక్తియోగము అనగా కళాశాల. ఆపైన కర్మ లేక కర్మ యోగము అనగా చివరిదైన విశ్వవిద్యాలయము. మహిమల ప్రదర్శనలు అనేవి అనూహ్య పరబ్రహ్మము యొక్క ఉనికిని ప్రతిపాదించే ఆరంభ స్థాయి LKG పాఠాలు. ఇదియే యోగవిద్యను నేర్చుకునే క్రమము.]

**ఇతి త్రైలోక్యగీతాయాం 'జ్ఞానభక్తికర్మ యోగో' నామ చతుర్థాధ్యాయః**

ఈ విధంగా త్రైలోక్యగీత యందు 'జ్ఞానభక్తికర్మ యోగము' అనబడే

నాలుగవ అధ్యాయము పరిసమాప్తము.